సాక్షి
కామారెడ్డి
మంగళవారం । 27 । ఆగస్టు । 2024



అర్హులందరికీ 'డబుల్' ఇళ్లు

అర్హులందరికీ 15 రోజుల్లో డబుల్ బెడ్ రూం ఇళ్లు అందజేస్తామని ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు అన్నారు.

- 8లో ▸



'భగీరథ'లో అందని వేతనాలు

మిషన్ భగీరథ క్షేత్రస్థాయి సిబ్బందికి నాలుగు నెలలుగా వేతనాలు అందకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు.

- 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
32.0 /22.3

ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అడపాదడపా ఓ మోస్తరునుంచి భారీ వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

పీజీ అడ్మిషన్లు ప్రారంభం

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీలో వివిధ పీజీ కోర్సులకు అడ్మిషన్లు ప్రారంభమైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె విజయ్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్ వెబ్ ఆప్షన్స్ ఈ నెల 27 నుంచి 30 వరకు ఇవ్వొచ్చని మొదటి విడత సీట్ల కేటాయింపు సెప్టెంబర్ 4న ఉంటుందన్నారు. ఎంఏ తెలుగు, ఆంగ్లం, రాజనీతి శాస్త్రం, అర్థశాస్త్రం, ఎంఎస్సీ భౌతిక, రసాయన, వృక్షశాస్త్రం, ఫారెస్ట్రీ, ఫిషరీస్, ఎంకాం వాణిజ్య శాస్త్రం, ఎంఎస్‌డబ్ల్యూ సామాజిక అధ్యయనంలో పీజీ కోర్సులు అందుబాటులో ఉన్నాయని వివరించారు.

హిందువులు ఏకం కావాలి



కామారెడ్డి టౌన్: కులాలకు అతీతంగా హిందువులంతా ఏకం కావాలని భాగ్యనగర్ క్షేత్ర సంఘటన మంత్రి గుమ్మల సత్యం అన్నారు. విశ్వహిందూ పరిషత్(వీహెచ్‌పీ) స్థాపన దివస్ సందర్భంగా సోమవారం జిల్లా కేంద్రంలోని సర్దార్ వల్లాబాయ్ పటేల్ చౌరస్తాలో ఆయన జెండా ఆవిష్కరించారు. 60 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా స్థాపన దివస్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వీహెచ్‌పీ ప్రాంత సేవ ప్రముఖ్ రాజేందర్ రెడ్డి, విభాగ కార్యదర్శి తుమ్మల కృష్ణ, జిల్లా అధ్యక్షుడు నిత్యానందం, సామల గంగారెడ్డి, బొల్లి రాజు, వెంకటస్వామి, మాతృశక్తి రాజశ్రీ, విశ్వం గుప్తా, వివేకానంద అశోక్, అజయ్ కుమార్, మంచాల రాజు యాదవ్, భరత్, వంశీ కుమార్ పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి



కామారెడ్డి టౌన్: రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న రూ.8 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్స్, స్కాలర్‌షిప్ నిధులను తక్షణమే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రజనీకాంత్ డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ నిర్లక్ష్యంతో పేద, మధ్య తరగతి విద్యార్థులు ఉన్నత చదువులకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఫీజుల కోసం ప్రైవేట్ కాలేజీలు విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయని, సర్టిఫికెట్లు ఇవ్వడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఎస్ అజయ్ కుమార్, ఉపాధ్యక్షుడు మణికంత, సాయి, రాహుల్ పాల్గొన్నారు.

వేగంగా పెరుగుతున్న ఎస్సారెస్పీ నీటిమట్టం

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి ఇన్‌ఫ్లో కొనసాగుతుండడంతో నీటిమట్టం వేగంగా పెరుగుతూ 57 టీఎంసీలు దాటింది. గత మూడు రోజులుగా ఎగువ ప్రాంతాల నుంచి 35 వేల క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుండటంతో నీటిమట్టం 6 టీఎంసీల మేర పెరిగింది. ప్రస్తుతం 29 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. కాకతీయ కాలువ ద్వారా 3 వేల క్యూసెక్కులు, లక్ష్మి కాలువ ద్వారా 50 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తుండగా, మిషన్ భగీరథ అవసరాలకు 231 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నారు. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి మట్టం 1091(80 టీఎంసీలు) అడుగులు కాగా సోమవారం సాయంత్రానికి 1084.20(57.32 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉందని అధికారులు తెలిపారు. ఈ ఏడాది జూన్ మొదటి వారం నుంచి ఇప్పటి వరకు 58 టీఎంసీల వరద ఎస్సారెస్పీలోకి వచ్చినట్లు వివరించారు.

షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి

ఆర్మూర్: షరతులు లేకుండా పంట రుణాలను సెప్టెంబర్ 15గా మాఫీ చేయడంతోపాటు రైతుభరోసా అందించాలని రైతు ఐక్య కార్యాచరణ కమిటీ సభ్యులు ప్రభాకర్, లింగారెడ్డి, దేగాం యాదగౌడ్, నూతుల శ్రీనివాస్‌రెడ్డి డిమాండ్ చేశారు. పట్టణంలోని కుమార్‌నారాయణ భవన్‌లో రైతు ఐక్య కార్యాచరణ కమిటీ ఆర్మూర్ డివిజన్ ఆధ్వర్యంలో సోమవారం సమావేశం నిర్వహించారు. రైతు జేఏసీ పిలుపు మేరకు మూడు నియోజకవర్గాల నుంచి వేలాది మంది రైతులు పోలీసుల వలయాన్ని ఛేదించుకుని వచ్చి ధర్నాలో పాల్గొనడం చారిత్రక ఘట్టమన్నారు. రైతులపై పెట్టిన కేసులను ఉపసంహరించుకోవాలని, సెప్టెంబర్ 15లోగా రుణమాఫీ చేయకపోతే 16న ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామన్నారు.

పాలకుడు లేని బల్దియా!

- జూలై 10న పదవీచ్యుతుడైన ఎల్లారెడ్డి మున్సిపల్ చైర్మన్
- ఎన్నికపై కాలయాపన చేస్తున్న యంత్రాంగం
- వైస్‌చైర్మన్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించని వైనం

చైర్మన్ కుర్చీ ఖాళీగా ఉండటంతో ఎల్లారెడ్డి బల్దియాలో సమస్యలు పట్టించుకునేవారు కరువయ్యారు. అవిశ్వాసంలో మున్సిపల్ చైర్మన్ పదవి కోల్పోయి నెలన్నర దాటినా కొత్త వారిని ఎన్నుకోలేదు. వైస్ చైర్మన్‌కు అదనపు బాధ్యతలు అప్పగించలేదు. దీంతో బల్దియాలో అధికారుల పాలన నడుస్తోంది.





సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : మున్సిపాలిటీ పాలక వర్గాల పదవీ కాలం ముగియకముందే అక్కడ అధికారుల పాలన నడుస్తోంది. కౌన్సిలర్లు పెట్టిన అవిశ్వాసంతో పదవీచ్యుతుడైన చైర్మన్ స్థానంలో కొత్త చైర్మన్‌ను ఎన్నుకునేందుకు చర్యలు చేపట్టాల్సిన యంత్రాంగం పట్టించుకోవడం లేదు. కనీసం వైస్ చైర్మన్‌కు బాధ్యతలు కూడా అప్పగించలేదు. దీంతో అందరు ఉన్నా ఆ మున్సిపాలిటీ అనాథగా మారింది ! ఇది కామారెడ్డి జిల్లాలోని ఎల్లారెడ్డి మున్సిపాలిటీ దీనగాథ.

ఇక్కడ బీఆర్ఎస్ నుంచి చైర్మన్‌గా ఎన్నికైన కుడుముల సత్యనారాయణ కాంగ్రెస్ పార్టీలో చేరడం, కౌన్సిల్‌లోని సభ్యులంతా చైర్మన్‌పై అవిశ్వాసం పెట్టడంతో చైర్మన్ పదవి కోల్పోయారు. పదవి నుంచి దిగిపోయి నెలన్నర దాటింది. కానీ అక్కడ చైర్మన్ ఎన్నిక ఇప్పటికీ నిర్వహించలేదు. కనీసం వైస్ చైర్మన్‌కు బాధ్యతలు అప్పగించలేదు. దీనికి రాజకీయాలే కారణమనేది స్పష్టంగా అర్థమవుతుంది. అయితే కామారెడ్డి మున్సిపాలిటీలో చైర్మన్‌పై పెట్టిన అవిశ్వాసం నెగ్గిన కొద్ది రోజుల్లోనే కొత్త చైర్మన్ ఎన్నిక నిర్వహించారు. ఎల్లారెడ్డికి వచ్చేసరికి మున్సిపల్ చట్టాలు ఇక్కడ పనిచేయడం లేదు.

నెలన్నరగా కుర్చీ ఖాళీనే..

మున్సిపల్ చైర్మన్ కుర్చీ నెలన్నరగా ఖాళీగానే ఉంటోంది. జూలై 10 నుంచి ఇప్పటి వరకు చైర్మన్ లేకుండా పాలన నడుస్తోంది. ఇతర మున్సిపాలిటీల్లో నిర్వహించినట్లుగా చైర్మన్ ఎన్నికను నిర్వహించకుండా తాత్సారం చేస్తున్నారు. దీంతో మున్సిపల్‌కు పాలకుడు లేకుండాపోయారు. చైర్మన్ పదవి కోల్పోతే తిరిగి ఎన్నిక నిర్వహించాలి. లేదంటే వైస్ చైర్మన్‌కు బాధ్యతలు అప్పగించాలి. కానీ అధికార యంత్రాంగం మాత్రం ఇప్పటికీ ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు.

రాజకీయ ఒత్తిళ్లే కారణమా

చైర్మన్ ఎన్నిక విషయంలో అధికారులు చర్యలు చేపట్టకపోవడంపై విమర్శలు వస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా చాలా మున్సిపాలిటీల్లో చైర్మన్‌లపై అవిశ్వాసం పెట్టి దింపేసిన తర్వాత చైర్మన్ ఎన్నిక నిర్వహించారు. జిల్లాలోని కామారెడ్డి మున్సిపాలిటీలో కూడా నిర్వహించిన అనుభవం ఉంది. మరి ఎల్లారెడ్డి చైర్మన్ ఎన్నికపై అధికారులు ఎందుకు తాత్సారం చేస్తున్నారో వెల్లడి కావడం లేదు. అధికార పార్టీలో చేరిన చైర్మన్‌ను పదవి నుంచి దింపేయడాన్ని ఆ పార్టీ ముఖ్య నేతలు జీర్ణించుకోలేక, కొత్త చైర్మన్ ఎన్నిక జరగకుండా అధికారులపై ఒత్తిడి తెస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ఏది ఏమైనా మున్సిపల్ పాలన నడవడానికి చైర్మన్ ఎన్నికను నిర్వహించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

అవిశ్వాసం జరిగిందిలా..

ఈ ఏడాది ఏప్రిల్ 27న ఎల్లారెడ్డి మున్సిపాలిటీకి చెందిన పది మంది కౌన్సిలర్లు కలెక్టర్‌కు అవిశ్వాసం పెడుతున్నట్టు లేఖను అందజేశారు. దీనిపై అప్పటి కలెక్టర్ జితేష్ వి పాటిల్ నిబంధనల ప్రకారం చైర్మన్‌పై అవిశ్వాసానికి మే 18న ప్రత్యేక సమావేశం ఏర్పాటుకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో అధికారులు ఏర్పాట్లు చేసి సమావేశం నిర్వహించగా 11 మంది కౌన్సిలర్లు చైర్మన్‌కు వ్యతిరేకంగా ఓటు వేశారు. అయితే చైర్మన్ సత్యనారాయణ హైకోర్టును ఆశ్రయించారు. కోర్టు ఆదేశాలు ఇచ్చేవరకు చైర్మన్‌పై అవిశ్వాసం ఫలితాన్ని వెల్లడించవద్దని స్టే విధించింది. దీనిపై కౌన్సిలర్లు కూడా హైకోర్టును ఆశ్రయించారు. విచారణ జరిపిన తర్వాత జూలై 3న హైకోర్టు ధర్మాసనం తీర్పును వెలువరించింది. జూలై 10న ఎన్నికల రిటర్నింగ్ అధికారి ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి అవిశ్వాసం నెగ్గిందని ప్రకటించారు. దీంతో చైర్మన్ సత్యనారాయణ పదవి కోల్పోయారు.

గోకుల కృష్ణా.. గోపాల కృష్ణా





జిల్లావ్యాప్తంగా సోమవారం శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఉదయం నుంచే ప్రజలు ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. చిన్నారులు రాధాకృష్ణులు, గోపిక వేషధారణలో ఆకట్టుకున్నారు. పలు గ్రామాల్లో యువకులు ఉత్సాహంగా ఉట్టి కొట్టే కార్యక్రమాల్లో పాల్గొన్నారు.



ఎల్లారెడ్డిలో ఉట్టి కొడుతున్న చిన్నారులు

'కొండపోచమ్మ' కరుణించేనా?

- నిరాశజనకంగా 'నిజాంసాగర్' నీటిమట్టం
- ఆయకట్టు కింద 1.15 లక్షల ఎకరాల్లో సాగు
- పంటలు గట్టెక్కాలంటే సుమారు ఆరు టీఎంసీలు అవసరం
- జలాశయంలో ఉంది 4.7 టీఎంసీలే..

నిజాంసాగర్: వర్షాకాలం ప్రారంభమై మూడు నెలలు కావొస్తున్నా భారీ వర్షాల జాడ లేదు. మంజీరలో జల సవ్వడులు లేవు. వరదలు లేక నిజాంసాగర్ ప్రాజెక్ట్ నీటిమట్టం నిరాశజనకంగా ఉంది. దీంతో ఆయకట్టు కింద పంటలు సాగు చేసిన రైతులు ఆందోళన చెందుతున్నారు. అయితే సిద్దిపేట జిల్లాలోని కొండపోచమ్మ సాగర్ నుంచి నీటిని నిజాంసాగర్‌కు తీసుకొస్తే ఆయకట్టు కింద పంటలు గట్టెక్కే అవకాశం ఉంది. దీంతో రైతులు కొండపోచమ్మ సాగర్‌పై ఆశలు పెట్టుకున్నారు. వానాకాలం సీజన్ ప్రారంభం నిజాంసాగర్ ప్రాజెక్టులోకి 1.2 టీఎంసీల నీరు వచ్చింది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం1405 అడుగులు (17.8 టీఎంసీలు) కాగా ప్రస్తుతం 1391.64 అడుగులు (4.794) టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉంది.

మొదటి విడతలో 1.127 టీఎంసీల నీరు విడుదల

నిజాంసాగర్ ప్రాజెక్టు ప్రధాన కాలువ కింద అలీసాగర్ రిజర్వాయర్ వరకు 1,15,800 ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. ప్రధాన కాలువ పరిధిలోని డిస్ట్రిబ్యూటరి 49 వరకు నీరు అందించాల్సి ఉంది. వానాకాలం పంటల సాగు, నాట్ల కోసం జూన్ 23న ప్రాజెక్టు నుంచి ప్రధాన కాలువకు మొదటి దఫా నీటిని విడుదల చేశారు. జూలై 4 వరకు 1.127 టీఎంసీల నీటిని మొదటి విడతలో విడుదల చేశారు. ఆ తర్వాత నీటి విడుదల చేపట్టలేదు. అడపాదడపా కురుస్తున్న వర్షాలకు తోడు, నిండుకుండలా మారిన సింగితం రిజర్వాయర్ నుంచి వచ్చిన నీరు నిజాంసాగర్ ప్రధాన కాలువలోకి వెళ్లడంతో ఆయకట్టును కొంత మేర ఆదుకుంది.



నిజాంసాగర్ ప్రాజెక్టు ప్రస్తుత నీటిమట్టం

వర్షాలు లేకపోవడంతో..

కొద్దిరోజులుగా వర్షాలు తగ్గుముఖం పట్టడంతో నిజాంసాగర్ ప్రాజెక్టు నీటి కోసం ఆయకట్టు ప్రాంత రైతులు ఎదురు చూస్తున్నారు. నీరందక పంటలు ఎండిపోతున్నాయని ప్రాజెక్టు నుంచి ప్రధాన కాలువకు నీటిని విడుదల చేయాలని కోరుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో అడపాదడపా కురుస్తున్న వర్షాలు ఆయకట్టు ప్రాంత పొలాలను ఆదుకుంటున్నాయి.

మొదటి ఆయకట్టు ప్రాంతానికి మాత్రం నిజాంసాగర్ ప్రధాన కాలువ జీవనాధారంగా మారింది. మొదటి ఆయకట్టు ప్రాంతంలోని నిజాంసాగర్, బాన్సువాడ, బీర్కూర్, నస్రుల్లాబాద్ మండలాల రైతులు నిజాంసాగర్ ప్రాజెక్టు నీటి కోసం నిరీక్షిస్తున్నారు.

నాలుగు తడులు అవసరం

నిజాంసాగర్ కింద సాగవుతున్న పొలాలు గట్టెక్కాలంటే నాలుగు తడుల నీరు అవసరం. ఒక్కో తడికి ఒక టీఎంసీ నుంచి 1.5 టీఎంసీ చొప్పున అందించాల్సి ఉంటుంది. ఈ లెక్కన సుమారు నాలుగు నుంచి ఆరు టీఎంసీలు అవసరం. అయితే ప్రాజెక్ట్‌లో ప్రస్తుతం 4.7టీఎంసీల నీరు మాత్రమే ఉంది. దీంతో పంటలు గట్టెక్కాలంటే కొండ పోచమ్మ సాగర్ నీరు ఎంతో అవసరం. కొండపోచమ్మ సాగర్‌లో ప్రస్తుతం 6 టీఎంసీల నీరు ఉంది. అందులో నుంచి నిజాంసాగర్ ప్రాజెక్టుకు రెండు టీఎంసీల నీటి విడుదలకు ప్రభుత్వం అనుమతించినట్లు నీటి పారుదలశాఖ అధికారులు తెలిపారు.

నీటిని విడుదల చేయాలి



నిజాంసాగర్ ఆయకట్టు కింద సాగుచేసిన పంటలకు ప్రస్తుతం నీళ్ల ఎంతో అవసరం. వానలు లేక పంటలు ఎండుముఖం పడుతున్నాయి. అధికారులు నీటి విడుదల చేపట్టాలి.

– రాములు, రైతు, తుంకిపల్లి

ప్రభుత్వం అనుమతి ఇచ్చింది

నిజాంసాగర్ ఆయకట్టు కింద పంటలను గట్టెక్కిస్తాం. ప్రస్తుతం ప్రాజెక్టులో 4.7 టీఎంసీల నీరు ఉంది. అక్టోబర్ నెలలో చివరి తడికి అవసరమైతే కొండపోచమ్మ సాగర్ నుంచి రెండు టీఎంసీల నీటి విడుదలకు ప్రభుత్వం అనుమతించింది.

– శ్రీనివాస్, ప్రాజెక్ట్ సీఈ

రైతులు అధైర్యపడొద్దు



కామారెడ్డి టౌన్: రైతులు అధైర్యపడొద్దని అందరికి రుణమాఫీ అవుతుందని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ అన్నారు. సోమవారం పట్టణంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆయన బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో పెండింగ్‌లో ఉన్న సీఎంఆర్ఎఫ్ చెక్కులను సీఎంతో మాట్లాడి మంజూరు చేయించానని తెలిపారు. ప్రతిపక్షాలు అనవసరంగా రుణమాఫీపై రాద్ధాంతం చేస్తున్నాయని విమర్శించారు. కో ఆపరేటీవ్ సొసైటీ బ్యాంకుల్లో, పోడు భూములు, అసైన్‌మెంట్ భూములపై రుణాలు మాఫీ కాలేదని రైతులు ఆయన దృష్టికి తీసుకు రావడంతో వ్యవసాయశాఖ మంత్రి నాగేశ్వరరావుతో ఫోన్‌లో మాట్లాడారు. అందరికీ రుణమాఫీ జరుగుతుందని భరోసా ఇచ్చారు. డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు, నాయకులు పండ్ల రాజు, గోనే శ్రీనివాస్, గూడెం శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి

- నిర్లక్ష్యంతో ప్రాణాలమీదికి తెచ్చుకోవద్దు
- జ్వరం వస్తే స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లాలి
- పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి
- 'సాక్షి' ఫోన్ ఇన్‌లో జీజీహెచ్ సూపరింటెండెంట్ రాంసింగ్

కామారెడ్డి టౌన్: సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని జీజీహెచ్ సూపరింటెండెంట్ రాంసింగ్ సూచించారు. సీజనల్ వ్యాధులపై సోమవారం 'సాక్షి' ఆధ్వర్యంలో నిర్వహించిన ఫోన్ ఇన్ కార్యక్రమంలో ప్రజల సందేహాలను ఆయన నివృత్తి చేశారు. జ్వరం వస్తే తక్షణమే స్థానిక ప్రభుత్వ ఆస్పత్రులకు వెళ్లాలన్నారు. ఎక్కువ రోజుల పాటు జ్వరం ఉంటే ప్లేట్‌లెట్స్ తగ్గకుండా చూసుకోవాన్నారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. దోమల నివారణ చర్యలు చేపట్టాలని, నిర్లక్ష్యం చేయకుండా వైద్యం చేయించుకోవాలన్నారు.

ప్రశ్న: మా ఇంట్లో అందరికీ జ్వరం వచ్చింది. 10 రోజులైనా తగ్గడం లేదు..

– ప్రభాకర్ పొందుర్తి, భిక్కనూరు

డాక్టర్: ఈ సీజన్‌లో వైరస్ ఎక్కువగా సోకుతుంది. జ్వరం వస్తే వారం నుంచి 10 రోజులకు వరకు ఉంటుంది. ఖంగారు పడకండి. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి వెళ్లి రక్తపరీక్షలు చేయించుకోండి. వైద్యుల సూచనల మేరకు జాగ్రత్తగా ఉండండి.

ప్రశ్న: మా గ్రామంలో చాలా మందికి జ్వరాలు సోకాయి. ప్రత్యేక క్యాంపు ఏర్పాటు చేసి వైద్య పరీక్షలు చేయండి సార్.

– బాలాగౌడ్, ఇసాయిపేట్, మాచారెడ్డి

డాక్టర్: డీఎంహెచ్‌వోతో మాట్లాడి మీ గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేయిస్తాం. తీవ్రంగా జ్వరాలు ఉంటే తక్షణమే స్థానిక పీహెచ్‌సీలకు కానీ, లేకుంటే కామారెడ్డి జిల్లా ఆస్పత్రికి రండి. నిర్లక్ష్యం చేయకండి.

ప్రశ్న: మా మండలంలోని పీహెచ్‌సీలో వైద్య సేవలు సరిగ్గా అందడం లేదు. మందులు కూడా ఇవ్వడం లేదు..

– జఫర్‌షా, పెద్దకొడప్‌గల్

డాక్టర్: మీ గ్రామంలో సీజనల్ వ్యాధులు ఉంటే తక్షణమే బాన్సువాడ ఆస్పత్రికి వెళ్లి వైద్య సేవలు పొందండి. పీహెచ్‌సీలో సమస్యలుంటే డీఎంహెచ్‌వోతో మాట్లాడి సమస్య పరిష్కారినికి కృషి చేస్తాం.

ప్రశ్న: ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్తే దోచుకుంటున్నారు..

– ఆముదాల రమేశ్, రాజంపేట

డాక్టర్: జ్వరం వస్తే ఖంగారు పడకుండా మొదట ప్రభుత్వ ఆస్పత్రికి రండి. అక్కడ వైద్య సేవలతో పాటు అన్ని రక్త పరీక్షలు చేస్తాం. అవసరమైన మందులు, గ్లూకోజ్‌లు ఉన్నాయి. అనవసరంగా ప్రైవేట్‌లకు, ఆర్ఎంపీ, పీఎంపీల వద్దకు వెళ్లి డబ్బులు వృథా చేసుకోవద్దు.

ప్రశ్న: తీవ్రంగా దగ్గు, జ్వరం ఉండి తగ్గడం లేదు. ఆస్పత్రిలో చూపించుకున్నా ఇంకా అలానే ఉంది.

– సతీశ్, ఎల్లారెడ్డి

డాక్టర్: జ్వరం ఉంటే స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో రక్త పరీక్షలు చేయించుకోండి. అవసరం అయితే డెంగీ పరీక్ష చేయించుకొండి. ప్లేట్‌లెట్స్ తగ్గకుండా చూసుకోవాలి. దగ్గు ఉంటే కాఫ్ సిరఫ్ తాగండి. ఇన్‌ఫెక్షన్ ఎక్కువ కాకుండా వైద్యుల సలహాలు తీసుకోండి. గోరువెచ్చని నీటిని తాగండి.

ప్రశ్న: మా ఊరిలో దోమల బెడదతో చాలా మంది జ్వరల బారిన పడుతున్నాం..

– అయ్యప్ప సంతోష్, దేశాయిపేట్

డాక్టర్: ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకునే బాధ్యత మనదే. దోమల నివారణ కోసం మురికి కాలువల్లో బ్లీచింగ్ పౌడర్ లేదా ఆయిల్‌బాల్స్ వేసుకోండి. ఇంట్లో దోమ తెరలు, మస్కిటో కాయిల్స్, లిక్విడ్స్ వాడండి. ముఖ్యంగా మధ్యాహ్నం దోమలు కుట్టకుండా చూసుకోవాలి. సానిటేషన్ విషయమై అధికారులకు ఫిర్యాదు చేయండి.



ప్రశ్న: జ్వరాలు వస్తున్నా ప్రభుత్వ ఆస్పత్రిలో పరీక్షలు చేయడం లేదు. గోలీలు ఇచ్చి పంపుతున్నారు..

– మహేశ్, బీబీపేట్

డాక్టర్: జ్వరం వచ్చిన మొదటి రోజే ఖంగారు పడవద్దు. వైద్యులు చూసి పారసెటమాల్, యాంటిబయాటిక్ మాత్రలు ఇస్తారు. అయినా తగ్గకుంటే రక్త పరీక్షలు చేసి తగిన వైద్యం అందిస్తారు. పీహెచ్‌సీలో పట్టించుకోకుంటే డీఎంహెచ్‌వోకు ఫిర్యాదు చేయండి.

ప్రశ్న: వారం రోజులుగా జ్వరంతో పాటు గొంతునొప్పి, దగ్గు ఉంది..

– ప్రదీప్, సదాశివనగర్

డాక్టర్: ఈ కాలంలో డెంగీ, చికున్ గున్యా, మలేరియా లాంటి వ్యాధులు సోకుతున్నాయి. గొంతునొప్పి, దగ్గు, నీరసం లాంటి లక్షణాలు ఉంటాయి. గోరువెచ్చని నీటిలో ఉప్పు, పసుపు వేసుకుని గార్లింగ్ చేయండి. నీటిని బాగా తాగాలి. తక్షణమే ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లండి. వైద్యుల సలహాలు తీసుకోండి. లేదంటే కామారెడ్డి జిల్లా ఆస్పత్రికి వచ్చి రక్తపరీక్షలు చేయించుకోండి. ప్రైవేట్‌కు గాని, ఆర్ఎంపీ, పీఎంపీల వద్దకు వెళ్లి ప్రాణాలమీదికి తెచ్చుకోకండి.

ప్రశ్న: వాంతులు, విరోచనాలతో పాటు జ్వరం వచ్చింది. మందులు వేసుకున్నా తగ్గడం లేదు..

– అంజయ్య, ముత్యంపేట, దోమకొండ

డాక్టర్: ప్రస్తుతం సీజనల్ వ్యాధులు వస్తాయి. మీరు తక్షణమే కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి రండి. రక్తపరీక్షలు చేయించుకోవాలి. నీటిని వేడిచేసుకుని వడకట్టిన తర్వాత తాగాలి. బీపీ తగ్గకుండా చూసుకోవాలి.

ప్రశ్న: మా గ్రామంలో చాలా మందికి జ్వరాలు, నొప్పులు ఉన్నా పరీక్షలు చేయకుండా గోలీలు ఇచ్చి పంపుతున్నారు..

– పందరి, పెద్దకొడప్‌గల్

డాక్టర్: వైరస్‌తో ఒకరి నుంచి మరొకరికి జ్వరాలు వస్తుంటాయి. వైరల్ ఫీవర్ వారం కంటే ఎక్కువగానే ఉంటుంది. నీటిని బాగా తీసుకోవాలి. వారం కంటే ఎక్కువగా జ్వరం ఉంటే బాన్సువాడ ఏరియా ఆస్పత్రికి వెళ్లి రక్తపరీక్షలు చేయించుకోండి.

క్లుప్తంగా

మోగని ఎస్సారెస్పీ అధికారుల ఫోన్లు

బాల్కొండ: ఎస్సారెస్పీ అధికారుల ఫోన్లు రెండు నెలలుగా మోగడం లేదు. దీంతో నీటి సమాచారం తెలియక ఆయకట్టు రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రాజెక్ట్ అధికారులకు ప్రభుత్వం సీయూజీ సిమ్‌లు ఇచ్చింది. బిల్లులు చెల్లించక పోవడంతో కంపెనీ వారు సేవలను నిలిపి వేశారు. గత రెండు నెలలుగా అధికారుల ఫోన్లు కలవకపోడంతో నీటి విడుదల, ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే వరదల వివరాలను తెలుసుకునేందుకు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు, పాలకులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

కొత్త సొసైటీతో మెరుగైన సేవలు



భిక్కనూరు: కాచాపూర్ గ్రామంలో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ సహకారంతోనే సొసైటీ ఏర్పాటైందంటూ ఆ గ్రామ నేతలు సోమవారం ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా షబ్బీర్‌అలీ మాట్లాడుతూ.. రైతుల సౌకర్యార్థం కాచాపూర్, బంజర్ల గ్రామాలకు కలిపి నూతన సొసైటీని ఏర్పాటు చేసినట్లు వివరించారు. రైతులకు ఈ సొసైటీ ద్వారా మెరుగైన సేవలు అందుతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ తోగరి సుదర్శన్, డీసీసీబీ మాజీ డైరెక్టర్ కిష్టాగౌడ్, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రకాంత్‌రెడ్డి, మండల కాంగ్రెస్ నేతలు అధ్యక్షుడు బీంరెడ్డి, నేతలు నర్సింగ్‌రావు, మైపాల్‌రెడ్డి, అంకం రాజు, నర్సింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బసవేశ్వర ఆలయంలో ఎమ్మెల్యే పూజలు

బిచ్కుంద(జుక్కల్): బోర్లం బసవేశ్వర ఆలయంలో సోమవారం ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు పూజలు చేశారు. మొక్కులు తీర్చుకున్నారు. శ్రావణ మాసం సందర్భంగా నెల రోజులు బసవేశ్వర ఆలయంలో బిచ్కుంద బండాయప్ప మఠం పీఠాధిపతి సోమయప్ప స్వామి శ్రావణ మాసం నుంచి ఆలయంలో దీక్షలో కూర్చున్నారు. ఎమ్మెల్యే సందర్శించి స్వామీజీ ఆశీస్సులు తీసుకున్నారు. యువకులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండి దైవ భక్తి పెంపొందించుకోవాలని ఎమ్మెల్యే అన్నారు. అందరు సుఖశాంతులతో ఉండాలని వేడుకున్నారు.

వీరాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం



పిట్లం(జుక్కల్): పోతురెడ్డిపల్లి తండాలోని వీరాంజనేయ స్వామి ఆలయ 11వ వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శివునికి ప్రత్యేక అర్చన కార్యక్రమాలు చేపట్టారు. సంగ్రాం మహారాజ్ ప్రవచనాలిచ్చారు. అనంతరం అన్న ప్రసాద కార్యక్రమం నిర్వహించారు. లక్ష తమలపాకులతో పూజలు చేశారు. నేడు మంగళవారం ఉదయం 10 గంటలకు వీరాంజనేయ స్వామికి రుద్ర హోమం నిర్వహిస్తామని, అనంతరం అన్నదానం ఉంటుందని ఆలయ సంరక్షకులు తేజ స్వామి, సురేష్ శర్మ పేర్కొన్నారు.

'భగీరథ'లో అందని వేతనాలు

- క్షేత్రస్థాయి సిబ్బందికి నాలుగు నెలలుగా చెల్లించని కాంట్రాక్ట్ కంపెనీలు
- పెండింగ్‌లో మరో రెండు నెలల బకాయిలు..
- రెండు జిల్లాల్లో 690 మంది ఉద్యోగులు



మోర్తాడ్‌లోని మిషన్ భగీరథ పంప్‌హౌస్

మోర్తాడ్: నాలుగు నెలలుగా వేతనాలు అందక మిషన్ భగీరథ క్షేత్రస్థాయి ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారు. పంప్‌హౌస్‌ల నుంచి నీటి సరఫరాను పరిశీలించేది ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులే అయినప్పటికీ.. క్షేత్ర స్థాయి సిబ్బందిని నియమించుకుని వారి ద్వారా పని చేయిస్తోంది మాత్రం కాంట్రాక్టు పొందిన కంపెనీలు. ముంబైకి చెందిన ఓ కంపెనీతోపాటు తెలుగు రాష్ట్రాలకు చెందిన మరో కంపెనీ మిషన్ భగీరథ నీటి సరఫరా కాంట్రాక్ట్‌ను పొందాయి. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో ముంబై కంపెనీకి సంబంధించి 600 మంది ఉద్యోగులు పని చేస్తుండగా, మరో కంపెనీ కింద 90 మంది పని చేస్తున్నారు. వీరిలో లైన్‌మన్‌లతోపాటు సూపర్‌వైజర్లు ఉన్నారు. లైన్‌మన్‌లకు ప్రతి నెలా రూ.10వేలకు పైగా, సూపర్‌వైజర్‌లకు రూ.15వేలకు పైగా వేతనాలు చెల్లించాల్సి ఉంది. కార్మిక శాఖ నిబంధనల ప్రకారం బిల్లులతో సంబంధం లేకుండా కాంట్రాక్టు కంపెనీలు తమ సిబ్బందికి వేతనాలు క్రమం తప్పకుండా చెల్లించాల్సి ఉండగా, ప్రభుత్వం నుంచి కొన్ని నెలలుగా తమకు బిల్లులు రావడం లేదని, వేతనాల చెల్లింపు ఆలస్యమవుతోందని ఆయా కంపెనీల ప్రతినిధులు చెబుతున్నారు.

నీటి సరఫరా నిలిపివేసి నిరసన

ముంబైకి చెందిన కాంట్రాక్టు కంపెనీ పరిధిలో పని చేస్తున్న ఉద్యోగులు వేతనాల కోసం తమ సంస్థ ప్రతినిధులకు విన్నవిస్తుండగా మరో కంపెనీ పరిధిలో పని చేస్తున్న 90 మంది ఉద్యోగులు మాత్రం నీటి సరఫరా నిలపివేసి నిరసన తెలిపారు. పది రోజుల క్రితం కామారెడ్డి ప్రాంతంలో నీటి సరఫరాను నిలిపివేశారు. ఈ నెలాఖరులోగా వేతనాలు చెల్లిస్తామని సదరు కాంట్రాక్టు కంపెనీ ప్రతినిధులు హామీ ఇవ్వడంతో ఉద్యోగులు నీటి సరఫరాను కొనసాగించారు.

త్వరలోనే వేతనాలు చెల్లిస్తారు

వేతనాలను చెల్లించాలని రెండు కాంట్రాక్టు కంపెనీలకు సూచించాం. త్వరలోనే చెల్లిస్తామని కంపెనీలు వెల్లడించాయి. ఈ నెలాఖరులోగా బకాయి వేతనాలు చెల్లించే అవకాశం ఉంది. కంపెనీలపై మేము కూడా ఒత్తిడి తీసుకు వస్తున్నాం.

– నరేశ్, ఈఈ, మిషన్ భగీరథ

'సింక్రో సర్వ్ గ్లోబల్ సొల్యూషన్'పై చర్యలు తీసుకోవాలి



సంస్థ ప్రతినిధులను నిలదీస్తున్న అభ్యర్థుల తల్లిదండ్రులు

సుభాష్‌నగర్/ ఖలీల్‌వాడి: కౌశల్ యోజన ద్వారా కుల వృత్తుల వారికి శిక్షణ అనంతరం సర్టిఫికెట్లు ఇవ్వకుండా అభ్యర్థుల నుంచి లంచాలు డిమాండ్ చేస్తున్న సింక్రో సర్వ్ గ్లోబల్ సొల్యూషన్ సంస్థ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు వరదబట్టు వేణురాజ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు అభ్యర్థులకు సర్టిఫికెట్లు ఇవ్వక పోవడంతో నగరంలోని యెండల టవర్స్ ఎదురుగా ఉన్న సంస్థ కార్యాలయం ఎదుట అభ్యర్థులతో కలిసి ఎన్‌ఎస్‌యూఐ ఆధ్వర్యంలో సోమవారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వేణురాజ్ మాట్లాడుతూ.. కౌశల్ యోజన ద్వారా వడ్రంగి, కుమ్మరి, కమ్మరి, స్వర్ణకారులు, శిల్పకారులు, చర్మ కారులు, ఇతర వృత్తుల వారికి శిక్షణ అందించి సర్టిఫికెట్లు ఇచ్చే కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం సింక్రో సర్వ్ గ్లోబల్ సొల్యూషన్స్ సంస్థకు అప్పగించిందని తెలిపారు. శిక్షణ తీసుకున్న అభ్యర్థులకు కోర్సు శిక్షణ పూర్తయిన 20 రోజుల్లోగా సర్టిఫికెట్స్ ఇవ్వాల్సి ఉండగా.. మూడు నెలలు గడిచినా ఇవ్వడం లేదన్నారు. సర్టిఫికెట్లు ఇవ్వాలని అడిగితే కొంతమంది సిబ్బంది డబ్బులు డిమాండ్ చేస్తున్నారని ఆరోపించారు. వెంటనే సంబంధిత అధికారులు స్పందించి యాజమాన్యంపై చర్యలు తీసుకొని అభ్యర్థులకు సర్టిఫికెట్లు అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో శిక్షణ పొందిన అభ్యర్థులు, వారి తల్లిదండ్రులు, చేతివృత్తిదారుల సంఘం ప్రతినిధులు, ఎన్‌ఎస్‌యూఐ నాయకులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రంలోని గిరిజన సంక్షేమ పాఠశాలలో పోలీసు శాఖ కళాబృందం ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. సైబర్ నేరాలు, మానవ అక్రమ రవాణా, రోడ్డు భద్రత తదితర అంశాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. డ్రగ్స్, గంజాయి లాంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో 100, 108, 181, 1930 సేవలను వినియోగించుకునే విధానాన్ని విద్యార్థులకు తెలియజేశారు.

సారూ.. ఇదేం తీరూ!

- సీజన్‌లోనే సెలవుపై వెళ్లిన మత్స్య అభివృద్ధి అధికారి
- ఇబ్బందుల్లో మత్స్యకారులు



పోచంపాడ్‌లోని మత్స్య అభివృద్ధి అధికారి కార్యాలయం

బాల్కొండ: ఎస్సారెస్పీ దిగువన ఉన్న జాతీయ చేప పిల్లల కేంద్రంలో మత్స్య అభివృద్ధి అధికారి రెండు నెలలు సెలవుపై వెళ్లడంతో సారూ.. ఇదేం తీరూ అంటు మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చేపపిల్లల కేంద్రంలోనే అధికారి కార్యాలయం ఉంటుంది. గత నెల క్రితం అధికారులు సాధారణ బదిలీలు నిర్వహించారు. బదిలీలకు ముందు ఇన్‌చార్జి అధికారిగా ఉన్న లాయక్ మొహినొద్దీన్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పూర్తిస్థాయిలో బాధ్యతలు చేపట్టారు. ఇటీవల బదిలీల్లో భాగంగా బాన్సువాడ నుంచి డొలిసింగ్ పోచంపాడ్ మత్స్య అభివృద్ధి అధికారిగా వచ్చారు. కానీ వారం రోజులు గడవక ముందే ఆయన యథాస్థానానికి వెళ్లిపోయారు. ఖాళీలు అధికంగా ఉండటంతో ఎక్కడ ఎలా భర్తీ చేయాలో తెలియక ఉన్నతాధికారులు బదిలీలను రద్దు చేస్తూ ఎక్కడి వారిని అక్కడే నియమించారు. లాయక్ మొహినొద్దీన్‌ను సైతం పోచంపాడ్‌కే కేటాయించారు. కాగా గత నెలకు పైగా సెలవులపై వెళ్లారు. అసలే చేప పిల్లల ఉత్పత్తికి ఆది నుంచి ఆటంకలు ఉన్నాయి. దీనికి తోడు అధికారి కూడా సకాలంలో ఉండక పోవడంతో చేప పిల్లల కేంద్రాన్ని ఫీల్డ్‌మన్‌లే చూసుకునే పరిస్థితి దాపురించింది. కొంత కాలంగా పోచంపాడ్ చేప పిల్లల కేంద్రానికి పూర్తి స్థాయిలో మత్స్య అభివృద్ధి అధికారిని ప్రభుత్వం నియమించలేదు.

2018 వరకు గతంలో జిల్లా ఏడీగా విధులు నిర్వర్తించిన రాజానర్సయ్య మత్స్య అభివృద్ధి అధికారిగా ఉన్నారు. దీర్ఘకాలికంగా ఆయనే ఇక్కడ విధులు నిర్వర్తించారు. మధ్యలో ఆర్మూర్ నుంచి పూర్ణిమ మత్స్య అభివృద్ధి అధికారిగా నిమమితులై పని చేశారు. రాజానర్సయ్య ఇన్‌చార్జి ఏడీగా బాధ్యతలు నిర్వర్తించిన సమయంలో కూడా పోచంపాడ్ బాధ్యతలు చేపట్టారు. కానీ ఆ తర్వాత పూర్తి స్థాయిలో ఏడీగా పదోన్నతి పొందిన నుంచి పోచంపాడ్‌కు ఇన్‌చార్జి అధికారులే దిక్కు అయ్యారు. దీంతో చేప పిల్లల ఉత్పత్తిపై అంత శ్రద్ధ కనిపించడం లేదు. ప్రస్తుతం నిజామాబాద్ ఏడీగా విధులు నిర్వర్తిస్తున్న ఏడీ ఆంజనేయులు స్వామీకి, సెలవుపై వెళ్లిన అధికారి మధ్య సమన్వయం కుదరడం లేదు. దీంతో పోచంపాడ్ మత్స్య అభివృద్ధి అధికారి సెలవుపై వెళ్లినట్లు సమాచారం. ఇకనైనా ఉన్నతాధికారులు పరిస్థితులను చక్కదిద్ది చేపపిల్లల కేంద్రం అభివృద్ధికి కృషి చేయాలని మత్స్యకారులు కోరుతున్నారు.

పదిహేను రోజుల్లో అర్హులందరికి 'డబుల్' ఇళ్లు

ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు



పరిసరాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

ఎల్లారెడ్డి: పదిహేను రోజుల్లో అర్హులందరికి డబుల్ బెడ్‌రూం ఇళ్ల పంపిణీ చేపడతామని ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు అన్నారు. సోమవారం ఎల్లారెడ్డి పట్టణ శివారులోని 1406 సర్వే నెంబర్‌లో నిర్మించిన 300 డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణాలను పరిశీలించి మాట్లాడారు. డబుల్ బెడ్‌రూంలు శిథిలావస్థకు చేరినా వాటిని పంపిణీ చేయడంలో గత పాలకులు విఫలమయ్యారని ఆరోపించారు. శిథిలావస్థకు చేరుకున్న డబుల్ బెడ్ రూంలను తాము స్వయంగా పరిశీలించి వాటికి కావాల్సిన సదుపాయాలను పూర్తి చేస్తున్నామన్నారు. పేదవాడి ఇంటి కలను నెరవేర్చుతామన్నారు. స్థలాలున్న వారికి ఇంటి నిర్మాణానికి అందిస్తామన్నారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వ్యవసాయ శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అర్హులైన ప్రతి రైతుకు రూ.2 లక్షల రుణమాఫీ జరగాలన్నారు. నియోజకవర్గంలో ఇంత వరకు రూ.205 కోట్ల రుణమాఫీ చేసినట్లు వివరించారు. మండల, పట్టణ పార్టీ అధ్యక్షులు సాయిబాబా, వినోద్‌గౌడ్, మున్సిపల్ మాజీ చైర్మన్ కుడుముల సత్యనారాయణ, మాజీ జెడ్పీటీసీ ఉషాగౌడ్, కాంగ్రెస్ నాయకులు గయాజుద్దీన్, వెంకట్రాంరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, తదితరులున్నారు.

'గంప' చొరవతోనే బస్వాపూర్ సొసైటీ విభజన



మాజీ సీఎం కేసీఆర్, మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న నేతలు

భిక్కనూరు: కామారెడ్డి మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ చొరవతోనే బస్వాపూర్ సొసైటీ విభజన జరిగి కాచాపూర్ సొసైటీ ఏర్పాటుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని బస్వాపూర్ సొసైటీ మాజీ వైస్ చైర్మన్ మద్ది స్వామి, బీఆర్‌ఎస్ నేతలు బుర్రి గోపాల్, మల్లేశ్ మల్లారెడ్డి, గౌరిగారి రాజిరెడ్డిలు అన్నారు. వారు సోమవారం బస్వాపూర్‌లో మాట్లాడారు. లాభాలతో ముందుకు సాగుతున్న బస్వాపూర్ సొసైటీలో నష్టాల ఊబిలో కూరుకుపోయిన కాచాపూర సొసైటీని కాంగ్రెస్ హయాంలోనే విలీనం చేశారన్నారు. దీని వల్ల బస్వాపూర్ సొసైటీ లాభాలు గణనీయంగా తగ్గాయన్నారు. ఈ విషయాన్ని గంప గోవర్ధన్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన అప్పటి సీఎం కేసీఆర్ సహకారంతో బస్వాపూర్ సొసైటీని కాచాపూర్, బస్వాపూర్ సొసైటీలుగా విభజించేలా ఉత్తర్వులు జారీ చేయించారన్నారు. దీంతో తన పదవి పోతుందని భావించిన అప్పటి బస్వాపూర్ సొసైటీ చైర్మన్, డీసీసీబీ డైరెక్టర్ లింగాల కిష్టాగౌడ్ స్వార్థంతో విభజన కాకుండా చేశారన్నారు. కాంగ్రెస్ హయాంలోనే విలీనం చేసిన విషయాన్ని ఆ పార్టీ వారు మరిచిపోయి నేడు మేమే విలీనాన్ని రద్దు చేయించామని చెప్పుకోవడం వారి తెలివి తక్కువతనానికి నిదర్శనమన్నారు. కాచాపూర్ నేతలు నేడు షబ్బీర్ అలీ చొరవతో సొసైటీ విభజన అయ్యిందని సంబురాలు జరుపుకోవడం సిగ్గుచేటన్నారు. పదేళ్లుగా బస్వాపూర్ సొసైటీలో జరిగిన అవినీతి అక్రమాలను వెలికితీస్తామన్నారు. సొసైటీ విభజనకు కృషిచేసిన గంప గోవర్ధన్, మాజీ సీఎం కేసీఆర్ చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు.

కృష్ణాష్టమి పండుగను ప్రభుత్వం గుర్తించాలి

- లబానా సమాజ్ కాయితీ లంబాడ సంఘం డిమాండ్



కృష్ణాష్టమి వేడుకలు నిర్వహిస్తున్న సంఘం నేతలు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): శ్రీ కృష్ణాష్టమి పండగను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించాలని లబానా సమాజ్ కాయితీ లంబాడ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. గాంధారి మండలంలోని వివిధ తండాలలో సోమవారం శ్రీ కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం లబానా సమాజ్ కాయితీ లంబాడసంఘం నాయకులు తాన్ సింగ్ నాయక్ మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం తమకు 10 శాతం ఎస్టీ రిజర్వేషన్‌ను అమలు చేయాలన్నారు. దీంతోపాటు లబానా కార్పొరేషన్ బోర్డును ఏర్పాటు చేయాలని కోరారు. లబానా లంబాడీలకు పోడు భూముల పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

టెండర్లను రద్దు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాయుడు రాజు

నిజామాబాద్‌నాగారం: ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో డైట్ సప్లై టెండర్లను పూర్తిగా రద్దు చేయాలని అంబేద్కర్ ఎస్సీ లేబర్ కాంట్రాక్ట్ కో–ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ అధ్యక్షుడు నాయుడు రాజు అన్నారు. నగరంలోని ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. టెండర్ నోటిఫికేషన్‌కు ముందే కొందరు అధికారులు గతంలో డైట్ సప్లై చేసిన వారికి టెండర్ దక్కేలా అన్ని ప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు. టెండర్ దరఖాస్తు ఫారాలు పూర్తిగా ఎవరికీ అర్థం కానీ పదాలతో ఉన్నాయన్నారు. అదే టెండర్ దరఖాస్తు ఫారం వరంగల్‌కు చెందిన దాంట్లో పూర్తిగా అర్థమయ్యేలా ఉందన్నారు. ఇకనైనా కలెక్టర్ స్పందించి టెండర్లను రద్దు చేసి కొత్త టెండర్లకు ఆహ్వానం పలకాలన్నారు. కార్యక్రమంలో మాల మహానాడు జిల్లా ఉపాధ్యక్షుడు బత్తుల కిష్టయ్య, బీసీ నాయకులు దేవేందర్ యాదవ్, కాంగ్రెస్ ఎస్టీ సెల్ నగర అధ్యక్షుడు సుభాష్ జాదవ్ తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్


చేపల వేటకు వెళ్లి ఒకరి మృతి



సాయన్న మృతదేహం

డొంకేశ్వర్: ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్‌లో చేపల వేటకు వెళ్లిన డొంకేశ్వర్ మండలం మారంపల్లి గ్రామానికి చెందిన సిరిగిరి సాయన్న(45) మృతి చెందాడు. ఎస్సై హరిబాబు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సాయన్న చేపలు పడుతూ జీవనం కొనసాగిస్తున్నాడు. ప్రతి రోజు లాగే మారంపల్లి శివారులోని ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్‌లో చేపలు పట్టేందుకు వెళ్లాడు. చేపల కోసం వేసిన వల ప్రమాదవశాత్తు అతని కాళ్లకు చుట్టుకోవడంతో నీట మునిగి మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

పేపర్‌మిల్‌కు చెందిన మరో వ్యక్తి..



రెంజల్: చేపలు పట్టేందుకు వెళ్లిన వ్యక్తి ప్రమాదవశాత్తు నీట మునిగి మృతి చెందాడు. మండలంలోని పేపర్‌మిల్‌కు చెందిన బోయి రాజు(41) రెండు రోజుల క్రితం చేపల పట్టేందుకు ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టిన పోలీసులు నీలా పెద్ద వాగు చెక్‌డ్యాంలో స్థానిక జాలార్లతో వెతికించగా సోమవారం సాయంత్రం కందకుర్తి శివారులోని మంజీరా, హరిద్ర నదులు కలిసే ప్రదేశంలో మృతదేహం లభించింది. భార్య సుజాత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బోధన్ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై సాయన్న పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ ఒకరు..



రామ్‌గోపాల్ మృతదేహం

ఖలీల్‌వాడి: పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన ఒకరు చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఐదో టౌన్ ఎస్సై వెంకట్రావు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. ఐదో టౌన్ పీఎస్ పరిధిలోని లలితానగర్‌కు చెందిన రాంగోపాల్(57) తన కుమార్తెకు సరైన పెళ్లి సంబంధాలు దొరకడం లేదనే మనస్తాపంతో ఈ నెల 21న ఇంటి బయట పురుగుల మందు తాగాడు. ఇంటికి వచ్చిన తర్వాత తన కుమారుడు సాయిరాంకు చెల్లిలి పెళ్లి చేయాలని, తాను పురుగుల మందు తాగినట్లు చెప్పాడు. దీంతో కుమారుడు వెంటనే జీజీహెచ్‌కు తరలించాడు. చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందాడు. కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకట్రావు పేర్కొన్నారు.

చెట్టును ఢీకొన్న ఆర్టీసీ బస్సు





ప్రమాదంలో గాయాలపాలైన ప్రయాణికులు



ఘటనాస్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

- 15 మందికి గాయాలు
- అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించిన ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు

ఎల్లారెడ్డిరూరల్: మూల మలుపు వద్ద ఎదురుగా వస్తున్న బస్సును తప్పించబోయి ఓ ఆర్టీసీ బస్సు చెట్టును ఢీకొన్నది. ఈ ఘటనలో 15 మందికి గాయాలయ్యాయి. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి నుంచి నిజాంసాగర్ వైపునకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు మండలంలోని హాజీపూర్ గేట్ మూల మలుపు వద్దకు రాగానే ఎదురుగా నిజాంసాగర్ నుంచి కామారెడ్డి వైపునకు వెళ్తున్న ఆర్టీసీ బస్సును తప్పించబోయి చెట్టును ఢీకొన్నది. బస్సు ముందు భాగం పూర్తిగా దెబ్బతినడంతో ముందు సీట్లలో ఉన్న 15 మందికి తీవ్ర గాయాలయ్యాయి. కాగా ఈ బస్సులో సుమారు 110 మంది ప్రయాణికులు ఉన్నారు. గాయాలైన వారిని స్థానికులు అంబులెన్స్‌లో ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రమాదంలో కండక్టర్ స్రవంతి, అడివిలింగాల గ్రామానికి చెందిన మన్నె విఠల్, హాజీపూర్‌కు చెందిన మంగ్లి, లక్ష్మి, సంఘి, లక్ష్మాపూర్‌కు చెందిన పర్వవ్వ, లింగంపేటకు చెందిన శ్రీనివాస్‌కు తీవ్రగాయాలయ్యాయి. వీరితో పాటు మరికొందరికి గాయాలు కాగా వారు ఆస్పత్రికి రాకుండానే ఘటన స్థలం నుంచి ఇతరుల సాయంతో వారి స్వస్థలాలకు వెళ్లిపోయారు. ప్రమాద విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు ఘటన స్థలానికి చేరుకొని గాయపడ్డ వారిని అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు. ప్రమాదంలో గాయపడ్డ వారికి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు ఫోన్‌లో సూచించారు. రోడ్డుకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించేలా చర్యలు తీసుకోవాలని ఆర్‌అండ్‌బీ అధికారులకు ఆదేశించారు.

నిందితుడి అరెస్ట్

ఖలీల్‌వాడి: రైల్వేస్టేషన్‌లో ప్రయాణికురాలి బ్యాగును దొంగిలించిన నిందితుడిని అరెస్టు చేసినట్లు రైల్వే ఎస్సై సాయిరెడ్డి సోమవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. జిల్లా కేంద్రంలోని రైల్వేస్టేషన్‌లో ఉదయం నిలిపి ఉన్న కృష్ణ ఎక్స్‌ప్రెస్ రైలులో హైదరాబాద్ నుంచి వస్తున్న మహమ్మద్ సలీం భార్య బ్యాగును ఎడపల్లి మండలం జానకంపేట్‌కు చెందిన సునీల్ దొంగిలించాడు. మళ్లీ సాయంత్రం రైల్వేస్టేషన్‌లో దొంగతనానికి వచ్చాడు. ప్లాట్‌ఫాం పై అనుమానాస్పదంగా తిరుగుతుండడంతో గమనించిన రైల్వే పోలీసులు పట్టుకొని విచారించారు. ఉదయం వచ్చిన కృష్ణ ఎక్స్‌ప్రెస్ రైలులో చోరీకి పాల్పడినట్లు నిందితుడు ఒప్పుకున్నాడు. సునీల్ నుంచి స్వాధీనం చేసుకున్న బ్యాగ్‌లో రెండు గ్రాముల కమ్మలు, 7 తులాల సిల్వర్, నాలుగు రింగులు ఉన్నట్లు తెలిపారు. బాధితుడు సలీం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

రుద్రూర్: కోటగిరి పీఎస్ పరిధిలోని పొతంగల్ మండలం కొడిచర్ల శివారులో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను ఆదివారం అర్ధరాత్రి సీజ్ చేసినట్లు తహసీల్దార్ మల్లయ్య పేర్కొన్నారు. మండలంలోని కొడిచర్ల నుంచి కల్లూర్‌కు ఇసుకను తరలిస్తుండగా రెవెన్యూ,పోలీసులు నిఘా వేసి పట్టుకున్నారని పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

నిజాంసాగర్(జుక్కల్): పిట్లం మండల సమీపంలోని సంగారెడ్డి–నాందేడ్ జాతీయ రహదారిపై సోమవారం ఉదయం బైక్ డివైడర్‌ను ఢీకొన్న ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. నిజాంసాగర్ మండలం నర్సింగ్‌రావుపల్లి గ్రామానికి చెందిన దుర్గయ్య, కిష్టవ్వ పిట్లంకు బైక్‌పై వస్తుండగా ప్రమాదవశాత్తు డివైడర్‌ను ఢీకొన్నారు. ఈ ఘటనలో కిష్టవ్వకు కాలు విరుగగా, దుర్గయ్య తలకు, ఛాతి భాగంలో గాయాలయ్యాయి. స్థానికులు చికిత్స నిమిత్తం బాన్సువాడ ఆస్పత్రికి తరలించారు.

పేకాట స్థావరంపై దాడి

దోమకొండ: మండల కేంద్రంలోని ఓ పేకాట స్థావరంపై దాడి చేసినట్లు ఎస్సై ఆంజనేయులు సోమవారం తెలిపారు. గ్రామానికి చెందిన ముగ్గురు పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో కలిసి దాడి చేసి వారిని పట్టుకున్నట్లు పేర్కొన్నారు. దాడిలో వారి నుంచి రూ. రూ.11,900 స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. గ్రామాల్లో ఎవరైనా పేకాట ఆడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

మినార్‌పల్లిలో బైక్ చోరీ

బోధన్‌రూరల్: మండలంలోని మినార్‌పల్లి గ్రామానికి చెందిన మూడ్ లక్ష్మణ్‌కు చెందిన బైక్ చోరీకి గురైనట్లు రూరల్ ఎస్సై మచ్చేందర్ తెలిపారు. సోమవారం మండల శివారులోని ఘన్‌పూర్ ఎక్స్ చౌరస్తా వద్ద నిలిపి తన బైక్‌ని నిలిపి సమీపంలోని తన పొలంలోకి వెళ్లి వచ్చే సరికి బైక్ చోరీకి గురైందని బాధితుడు తెలిపాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

హుమ్నాపూర్‌లో చిరుత సంచారం

వర్ని: మండలంలోని హుమ్నాపూర్ అటవీ ప్రాంతంలో చిరుత సంచరిస్తోంది. హుమ్నాపూర్, ఘన్‌పూర్ అటవీ ప్రాంతాల్లో చిరుత సంచరిస్తున్న ఆనవాళ్లను గుర్తించినట్లు గ్రామస్తులు, మేకల కాపరులు సోమవారం తెలిపారు. ఇటీవల కొన్ని మేకలు మేత కోసం అటవీ ప్రాంతంలోకి వెళ్లగా తిరిగి రాలేదు. కాపరులు అడవిలో గాలించగా మేకల కళేబరాలు గుర్తించారు. అడవిలో చిరుత సంచరిస్తున్నందున చుట్టు పక్కల గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అటవీశాఖ అధికారులు సూచిస్తున్నారు. ప్రజలు గుంపుగుంపులుగా సంచరించాలన్నారు.